GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ AFTERNOON 2PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 80 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 22 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# 'అమరావతి డ్రోన్ సమ్మిట్ ప్రారంభం

**'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' ప్రారంభమైంది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్లో దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.**



**మంగళగిరి,అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' ప్రారంభమైంది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్లో దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రెండు రోజులపాటు జాతీయ స్థాయిలో ఇది జరగనుంది. సదస్సులో తొమ్మిది ప్యానల్ డిస్కషన్లు, 50 స్టాళ్లలో డ్రోన్ల ప్రదర్శన, రాష్ట్ర ముసాయిదా డ్రోన్ పాలసీ పత్రం ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు ఉంటాయి. డ్రోన్ల రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానానికి చేర్చేందుకు ఈ సదస్సు తొలి అడుగుగా మార-ుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. పౌర విమానయాన శాఖ, డీఎస్ఐ, సీఐఐ భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సమ్మిట్లో భాగంగా కృష్ణా తీరంలో మంగళవారం సాయంత్రం 5,500 డ్రోన్లతో ప్రదర్శన జరగనుంది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద డ్రోన్ల ప్రదర్శన కానుంది. డ్రోన్లు సుమారు అర కిలోమీటరు ఎత్తుకు గాల్లో ఎగిరి.. ఏడు ఆకృతులను ఆవిష్కరిస్తాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడారు. 'ఈజ్ ఆఫ్ లివింగ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రభుత్వ విధానం. పెరుగుతున్న డ్రోన్ల వినియోగాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. యువ పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

# లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్ కౌంటర్ చేస్తే రూ.కోటికి పైగా నజరానా: కర్ణిసేన


**గ్యాంగ్స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ని పోలీసులు ఎవరైనా ఎన్ కౌంటర్ చేస్తే రూ. కోటికి పైగా రివార్డు ఇస్తామని కర్ణి సేన ప్రకటించింది.**

**ముంబయి, అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యతో గ్యాంగ్స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు మరోసారి దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రస్తుతం జైల్లో ఉన్న అతడిని ఎన్కౌంటర్ చేసిన పోలీసులకు రూ.కోటికి పైగా నజరానా ఇస్తామని క్షత్రియ కర్ణి సేన రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ వీడియో విడుదల చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి."లారెన్స్ బిష్ణోయ్ ని ఎన్ కౌంటర్ చేసిన ఏ పోలీసు అధికారికైనా వారి భద్రత, కుటుంబ భవిష్యత్తు కోసం రూ.కోటికి పైగా ఇస్తాము. ఈ గ్యాంగ్ ఎన్ని హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. మా అధినేత సుఖ్వ సింగ్ గోగమేడిని చంపిన వారిని వదిలేది లేదు" అని రాజ్ షెకావత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.కాగా 2023, డిసెంబర్ లో రాష్ట్రీయ రాజ్పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖేవ్ సింగ్ గోగామేడీని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. అనంతరం ఆయనను తామే హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. తాజాగా ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్ఖాన్ స్నేహితుడు బాబా సిద్దిఖీ ని హత్య చేసింది కూడా తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వెల్లడించింది. అతడికి అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు ఉండటంవల్లే హత్య చేసినట్లుగా పేర్కొంది.గ్యాంగ్స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. బ్యారక్ ల్లోకి అక్రమంగా వచ్చే సెల్ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈ విధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. 2015లో విడుదలైన 'నేను రౌడీనే'లో విజయ్ సేతుపతి హీరోగా నటించారు. ఈ చిత్రం షూటింగ్లోనే నయనతార, విఘ్నేష్లు స్నేహితులయ్యారు. వారి స్నేహం ప్రేమగా మారింది. ఇది విడుదలైన ఏడేళ్ల తర్వాత 2021లో వీళ్ల ప్రేమను మీడియా ముందు చెప్పారు. 2022 జూన్ 9న వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఈ జంటకు ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్నారు.



## ఎమ్మెల్సీ జీవన్రెడ్డి ముఖ్య అనుచరుడి దారుణహత్య

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి (58) దారుణహత్యకు గురయ్యారు.**



**జగిత్యాల,** కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి (58) దారుణహత్యకు గురయ్యారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం సంతోష్ అనే వ్యక్తి గంగారెడ్డిని కారుతో ఢీకొట్టాడు. ఆ తర్వాత కత్తితో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ హత్యకు నిరసనగా జగిత్యాల పాతబస్టాండ్ వద్ద తన అనుచరులతో కలిసి జీవన్రెడ్డి ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులకు రక్షణ లేనప్పుడు తామెందుకని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. జగిత్యాలలో భారాస ప్రభుత్వమా? అని మండిపడ్డారు.

## పేలుడు ఘటన మరువకముందే.. సీఆర్పీఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు

**ఢిల్లీలో సీఆర్ పీఎఫ్ పాఠశాల సమీపంలో జరిగిన పేలుడు ఘటన మరువకముందే..**

**మరోసారి దేశవ్యాప్తంగా ఆ విభాగం పాఠశాలలను బెదిరిస్తూ ఇ-మెయిల్ వచ్చింది.**



**ఢిల్లీ, అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్పీఎఫ్ పాఠశాలల కు బాంబు బెదిరింపులు వచ్చాయి. కేవలం భయపెట్టేందుకే కొందరు నకిలీ ఇ-మెయిల్ను పంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని పాఠశాలల గదుల్లో పేలుడు పదార్థాలు ఉంచామని, ఉదయం 11 గంటల్లోపు అన్ని స్కూళ్లను ఖాళీ చేయాలని దుండగులు అందులో హెచ్చరించారు.ఇదిలా ఉంటే.. ఆదివారం ఉదయం ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఉన్న సీఆర్ పీఎఫ్ పాఠశాల సమీపంలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. పేలుడు తీవ్రతకు ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించింది. పాఠశాల గోడ కూలిపోవడంతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయి. పాఠశాల సమీపంలోని మట్టి, అక్కడ గుర్తించిన తెల్లని పౌడర్ నమూనాలనూ ల్యాబ్కు పంపించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్జీ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఇక్కడ ఎన్ఎస్‌జీ రోబోలను మోహరించింది.ఇటీవలికాలంలో బాంబు బెదిరింపులు ఓ సమస్యగా మారాయి. గత కొద్దిరోజులుగా విమానయాన సంస్థలకు ఈ బూటకపు సందేశాలు ఎక్కువయ్యాయి. దాంతో విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇటు ప్రజలు భయభ్రాంతులకు లోన-వుతున్నారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు.

## పెట్రోల్ పోసి నిప్పంటించి.. చిల్లకూరులో తెదేపా నేత దారుణహత్య

**తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారం పేటలో దారుణం చోటుచేసుకుంది. రాజకీయ కక్షలతో తెదేపా నేత మల్లారపు హరిప్రసాద్ (20)ను వైకాపా కార్యకర్తలు చంపారు.**



**చిల్లకూరు,అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారంపేటలో దారుణం చోటుచేసుకుంది. రాజకీయ కక్షలతో తెదేపా నేత మల్లారపు హరిప్రసాద్ (20)ను వైకాపా కార్యకర్తలు చంపారు. సోమవారం రాత్రి తన బంధువు చెలగల కాటయ్యతో హరిప్రసాద్ బయటకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి దాటాక తిరిగి వచ్చి కాటయ్య ఇంట్లో ఆయన నిద్రిస్తుండగా మంగళవారం వేకువజామున అక్కడికి వెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఘటనాస్థలంలోనే హరిప్రసాద్ మృతిచెందారు. వైకాపాకు చెందిన కట్టా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుంపల మధు, అతని అనుచరులు దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## దారి ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్పై ప్రైవేట్ బస్సు డ్రైవర్ల దాడి..

**పొదిలి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్పై దాడి జరిగింది.**

**పొదిలి, అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** ప్రకాశం జిల్లా పొదిలి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్పై దాడి జరిగింది. నిన్న రాత్రి కురిచేడు వద్ద ఆర్టీసీ డ్రైవర్ సతార్ను ప్రైవేటు బస్సుల డ్రైవర్లు చితకబాదారు. ప్రైవేటు బస్సులకు ఆర్టీసీ బస్సు దారి ఇవ్వలేదని దాడికి పాల్పడ్డారు. ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వెళ్తుండగా వినుకొండ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్కు గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనకు నిరసనగా పొదిలి బస్టాండ్ వద్ద ప్రైవేటు బస్సులను ఆపి ఆర్టీసీ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.



## సియోల్లో రెండో రోజు తెలంగాణ మంత్రుల బృందం పర్యటన


**దక్షిణ కొరియా రాజధాని సియోల్లో తెలంగాణ మంత్రుల పర్యటన కొనసాగుతోంది. దక్షిణ కొరియాలోని ముఖ్యమైన హన్ నది పునరుజ్జీవన ప్రాజెక్టు మంత్రులు, అధికారుల బృందం పరిశీలించింది.**



**సియోల్, అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** దక్షిణ కొరియా రాజధాని సియోల్లో తెలంగాణ మంత్రుల పర్యటన కొనసాగుతోంది. దక్షిణ కొరియాలోని ముఖ్యమైన హన్ నది పునరుజ్జీవన ప్రాజెక్టు మంత్రులు, అధికారుల బృందం పరిశీలించింది. సియోల్ నగరంలో నీటి సరఫరా, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు ఈ నది కీలకంగా మారింది. కాలుష్యానికి గురైన హన్ నదిని శుభ్రపరిచి దక్షిణ కొరియా ప్రభుత్వం పునరుద్ధరించింది. మొత్తం 494 కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ నది.. సియోల్ నగరంలో 40 కి.మీ. మేర ప్రవహిస్తోంది. ప్రక్షాళన తర్వాత శుభ్రంగా మారి, ఇప్పుడు సియోల్ నగరానికి ఒక ముఖ్యమైన పర్యాటక ప్రదేశం, జలవనరుగా మారింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి, పురపాలకశాఖ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఈ నదిని పరిశీలించారు.

## హోటల్లో వెంటపడిన కుక్క.. మూడో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి

**నగరంలోని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. హోటల్లో కుక్క వెంటపడటంతో మూడో అంతస్తు నుంచి పడి యువకుడు మృతిచెందాడు.**



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** హైదరాబాద్ లోని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. హోటల్లో కుక్క వెంటపడటంతో మూడో అంతస్తు నుంచి పడి యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. మచంద్రాపురంలోని అశోక్ నగర్ లో తెనాలి యువకుడు ఉదయ్ (23) ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి అతడు చందానగర్ లోని వీవీప్రైడ్ హోటల్కు వెళ్లాడు. హోటల్ మూడో అంతస్తు బాల్కనీలోకి వెళ్లగానే ఓ కుక్క కనిపించడంతో ఉదయ్ దాన్ని తరిమేందుకు యత్నించాడు. అది వెంటపడటంతో తప్పించుకునేందుకు పరిగెత్తాడు. ఈ క్రమంలో హోటల్ కిటికీ నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినా బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ తనిఖీలు

**ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు.**

**అమరావతి,అక్టోబర్ 21 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో పలుచోట్ల డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న ఎస్వీఆర్ డిస్టిలరీస్పై దాడులు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్బీ డిస్టిలరీస్లోలో తనిఖీలు చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగారయకొండ మండలం పాత సింగరాయకొండ పరిధిలోని పెరల్ డిస్టిలరీని అధికారులు తనిఖీలు చేశా-రు.మరోవైపు నంద్యాలలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ను సీఐడీ అధికారులు పరిశీలించారు. సంస్థపై పలు ఆరోపణలు రావడంతో సీఐడీ అదనపు ఎస్పీ హుస్సేన్ పీర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 30 మంది అధికారులు పాల్గొన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆ సినిమా నా జీవితాన్ని శాశ్వతంగా మార్చేసింది.. విఘ్నేశ్కు థ్యాంక్స్ చెప్పిన నయనతార

విఘ్నేశ్ దర్శకత్వంలో వచ్చిన 'నేను రౌడినే' సినిమా విడుదలై 9 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా నయనతార ఆ సినిమాను గుర్తుచేసుకున్నారు.



అందమైన జోడీల్లో నయనతార– విఘ్నేశ్ శివన్ల ల జంట ఒకటి. వీరిని కలిపింది మాత్రం 'నేను రౌడినే' చిత్రం. విఘ్నేశ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో నయనతార హీరోయిన్. అలా వీరి పరిచయం ఏర్పడింది. ఆ సినిమా విడుదలై 9 ఏళ్లు పూర్తైన సందర్భంగా నయనతార ఓ ప్రత్యేక పోస్ట్ పెట్టారు. విఘ్నేశ్కు థ్యాంక్స్ చెబుతూ ఈ చిత్రం తన జీవితాన్ని మార్చేసిందన్నారు."నా జీవితాన్ని శాశ్వతంగా మార్చేసిన చిత్రం. నా కెరీర్ను గొప్పగా మలచిన సినిమా 'నేను రౌడినే'. 9ఏళ్ల క్రితం విడుదలై విజయాన్ని సొంతం చేసుకొని మర్చిపోలేని అనుభూతుల్ని అందించింది. ఈ విషయంలో ప్రేక్షకులకు రుణపడి ఉంటాను. ఇలాంటి గొప్ప సినిమాలో అవకాశం ఇచ్చినందుకు విఘ్నేశ్కు కృతజ్ఞతలు. దీని నుంచి నటిగా కొత్త అనుభవాలు నేర్చుకున్నాను. ఈ సినిమా నాకువిఘ్నేశ్ను ఇచ్చింది" అని రాసుకొచ్చారు. ఇక ఈ చిత్రం గురించి గతంలో విఘ్నేశ్ మాట్లాడుతూ.. "నేను రౌడినే' సినిమాలో హీరోయిన్గా నయనతార అయితే బాగుంటుందని ధనుష్ చెప్పారు. దీంతో ఆమెకు కథ వినిపించాను. వెంటనే ఓకే చేసింది. చిత్రీకరణకు సంవత్సరం పట్టింది. ఆ ఏడాదంతా ఆమెతో ఉండే అవకాశం వచ్చింది. తన ఇష్టాయిష్టాలను తెలుసుకునే సమయం దొరికింది' అని చెప్పారు.2015లో విడుదలైన 'నేను రౌడినే'లో విజయ్ సేతుపతి హీరోగా నటించారు. ఈ చిత్రం షూటింగ్లోనే నయనతార, విఘ్నేశ్ల స్నేహితులయ్యారు. వారి స్నేహం ప్రేమగా మారింది. ఇది విడుదలైన ఏడేళ్ల తర్వాత 2021లో వీళ్ల ప్రేమను మీడియా ముందు చెప్పారు. 2022 జూన్ 9న వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఈ జంటకు ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్నారు.

## నా మైండ్లోకి వచ్చిన హీరోయిన్ ఆమెనే..

ఇక ఇదే ఇంటర్వ్యూలో వరుణ్ మాట్లాడుతూ సమంతపై ప్రశంసలు కురిపించారు. 'సిటాడెల్' స్క్రిప్ట్ తన వద్దకు రాగానే ఇందులో హీరోయిన్గా సమంత అయితే బాగుంటుందని అనుకున్నట్లు చెప్పారు. 'దర్శకులతో దీని గురించి చర్చించినప్పుడు నా మైండ్లోకి వచ్చిన మొదటి హీరోయిన్ సమంతనే. ఆమె అయితే ఈ పాత్రకు పూర్తి న్యాయం చేయగలరనిపించింది. ఆమె ఇందులో భాగమైతే ప్రాజెక్ట్ మరింత పెద్దదవుతుందనుకున్నాం. అనుకున్నట్లే ఆమెను ఎంపిక చేశాం. ఇందులో మా ఇద్దరి కెమిస్ట్రీ బాగుంది' అని చెప్పారు. యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్ సిరీస్ గా 'సిటాడెల్: హనీ బన్నీ' రూపొందింది. ఇందులో సమంత హనీ పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల దీని ట్రైలర్ విడుదల చేయగా మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. బాలీవుడ్ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపించారు. సిరీస్ విడుదల కోసం వేచిచూస్తున్నట్లు చెప్పారు.

# ఓటీటీలోకి 'సత్యం సుందరం'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

కార్తి తాజా చిత్రం 'సత్యం సుందరం' ఓటీటీలో విడుదలకు సిద్ధమైంది. నెటిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.



ఇంటర్నెట్ డెస్క్: అరవింద్ స్వామి బావ, బావమరిదిగా నటించిన చిత్రం 'సత్యం సుందరం' ప్రేమ్ కుమార్ దర్శకుడు. శ్రీదివ్య కీలక పాత్ర పోషించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడీ కామెడీ డ్రామా ఓటీటీలో విడుదలకు సిద్ధమైంది. నెటిక్స్ వేదికగా అక్టోబర్ 27 నుంచి డిజిటల్ ప్రేక్షకులను అలరించనుంది. తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెటిక్స్ పోస్టర్ను విడుదల చేసింది.

ఇదీ చదవండి: భారీ బడ్జెట్ అయినా.. అలాంటి సినిమాలకు నో చెప్పేస్తా: నిత్యా మేనన్

కథేంటంటే: సత్యమూర్తి అలియాస్ సత్యం (అరవింద్ స్వామి)ది గుంటూరు దగ్గరున్న ఉద్దండరాయుని పాలెం. అతనికి ఆ ఊరన్నా.. అక్కడ ఉన్న తమ తాతల కాలం నాటి ఇళ్లన్నా చాలా ఇష్టం. కొందరు బంధువులు చేసిన మోసం వల్ల సత్యం యుక్తవయసులో ఉన్నప్పుడే వాళ్ల కుటుంబం ఆ ఇల్లు కోల్పోతుంది. దీంతో వాళ్లు ఆ ఊరుని వదిలేసి వైజాగ్ వచ్చి స్థిరపడతారు. ఈ క్రమంలోనే 30ఏళ్లు గడిచిపోతాయి. అయితే ఇన్నేళ్లు గడిచినా సత్యంను తన ఊరు, ఇంటి జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. ఓసారి తన బాబాయ్ కూతురు పెళ్లి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో సత్యం ఉద్దండరాయుని పాలెం వెళ్లాల్సి వస్తుంది. ఆ పెళ్లిలోనే అతన్ని బావా అని ఆప్యాయంగా పలకరిస్తూ ఓ వ్యక్తి (కార్తి) తారసపడతాడు. నిజానికి అతనెవరు.. తన పేరేంటన్నది సత్యం గుర్తుపట్టకున్నా.. మొహమాటం కొద్దీ తను పరిచయమున్నట్లుగానే నటిస్తూ వస్తాడు. మొదట్లో అతని అతి వాగుడు.. మితిమీరిన కలుపుగోలుతనం చూసి తనని జిడ్డులా భావిస్తాడు సత్యం. కానీ, కలిసి ప్రయాణం చేసే కొద్దీ అతను చూపే ఆప్యాయత, ప్రేమాభిమానాలు సత్యం మనసును కట్టిపడేస్తాయి. మరి వీళ్లిద్దరి ప్రయాణం ఏ మజిలీకి చేరింది? ఈ ప్రయాణంలో సత్యం తనని తాను ఎలా తెలుసుకున్నాడు? బావా అని పిలుస్తున్న ఆ వ్యక్తితో అతనికున్న బంధం ఏంటి? ఆఖరికి అతని పేరు సత్యంకు గుర్తొచ్చిందా? లేదా? అన్నది మిగతా కథ.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1879: బ్రిటిషు మొట్ట మొదటి రాజద్రోహ నేరాన్ని నమోదు చేసింది. వాసుదేవ బల్వంత ఫడ్కే మొదటి ముద్దాయి.
- 1894: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంపాదకుడు కోలవెన్ను రామకోటీశ్వరరావు జననం (మ.1970).
- 1900: భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ జననం (మ.1927).
- 1934: పేదల పక్షపాతిగా, నిస్వార్థ సేవకునిగా పేరొందిన మాజీ ఐఎఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ జననం (మ.2010)
- 1901: గిరిజనోద్యమ నాయకుడు కొమురం భీమ్ జననం (మ.1940). (చిత్రంలో)
- 1963: భాక్రా నంగల్ ఆనకట్టను ప్రధాని నెహ్రూ జాతికి అంకితం చేసాడు.
- 1966: సోవియట్ యూనియన్ లూనా 12 అంతరిక్ష నౌక ను ప్రయోగించింది.



వాసుదేవ బల్వంత ఫడ్కే



రామకోటీశ్వరరావు



అష్ఫాకుల్లా ఖాన్



ఎస్.ఆర్.శంకరన్



కొమురం భీమ్



భాక్రా నంగల్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# పృథ్వీ షాకు షాక్ ఇచ్చిన ముంబయి.. అధిక బరువు, క్రమశిక్షణ లోపించడమే కారణమా?

పృథ్వీ షాను ముంబయి రంజీ జట్టు నుంచి తప్పించారు. అతడిని పక్కనపెట్టడానికి ఆ క్రికెట్ అసోసియేషన్ స్పష్టమైన కారణం చెప్పలేదు.



ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ పృథ్వీ షా చేజేతులా తన కెరీర్ను నాశనం చేసుకుంటున్నాడు. తనతో కలిసి ఆడిన క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్లో రాణిస్తుంటే 24 ఏళ్ల పృథ్వీ షా మాత్రం ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ ఆటపై దృష్టి పెట్టలేకపోతున్నాడు. ఇప్పటికే భారత జట్టుకు దూరమైన అతడు.. తాజాగా రంజీ ట్రోఫీ జట్టులోనూ స్థానం కోల్పోయాడు. ముంబయి రంజీ టీమ్లోకి పృథ్వీ షాను ఎంపిక చేయలేదు. అతడిని పక్కనపెట్టడానికి ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పష్టమైన కారణం చెప్పలేదు. కానీ.. ఫిట్నెస్, క్రమశిక్షణారాహిత్యం వల్లే షాపై వేటు వేసినట్లు తెలుస్తోంది.నెట్ సెషన్స్కు అతడు ఆలస్యంగా రావడంతోపాటు అప్పుడప్పుడు దుమ్మా కొడుతున్నాడట. ఒక వేళ పాల్గొన్నా.. వాటిని సీరియస్ గా తీసుకోవట్లేదని సమాచారం. అతడి ఫిట్నెస్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. పృథ్వీ షా అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నాడట. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ముంబయి క్రికెట్ అసోసియేషన్ సెలక్టర్లు అతడిపై క్రమశిక్షణాచర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట. పృథ్వీని జట్టు నుంచి తప్పించాలనే నిర్ణయం కేవలం మేనేజ్మెంట్, సెలక్టర్లు తీసుకున్నది కాదట. కెప్టెన్, కోచ్ కూడా దీనిని సమర్థించినట్లు సమాచారం.కేవలం 18 ఏళ్ల వయసులోనే భారత జట్టు తరపున టెస్టు కెరీర్ ఆరంభించిన పృథ్వీ షా తొలి మ్యాచ్లోనే సెంచరీ కొట్టి అబ్బురపరిచాడు. అంత గొప్పగా కెరీర్ను ఆరంభించిన కుర్రాడు.. ఇప్పుడు టీమ్ ఇండియా ఛాయల్లోనే లేదు. ప్రతిభకు లోటు లేని ఇతడిలో.. క్రమశిక్షణ కొరవడి, ఫిట్నెస్ లేక చేజేతులా కెరీర్ను దెబ్బ తీసుకుంటున్నాడు. టీమ్ ఇండియా తరపున అతడు చివరగా 2021 జులైలో శ్రీలంకతో టీ20 మ్యాచ్ ఆడాడు.

## ఆరోగ్యం

అనేక కారణాల వల్ల చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. కొంతమంది అప్పటికప్పుడే గుండెపోటు వచ్చి కుప్పకూలి ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి, ముందునుంచే జాగ్రత్తగా ఉండాలి. అయితే, కొన్నిసార్లు ఎలాంటి లక్షణాలు లేకుండానే గుండెపోటు వస్తుంది. కానీ, చాలా సందర్భాల్లో కొన్ని లక్షణాల ద్వారా మన బాడీ ముందుగానే మనల్ని అలర్ట్ చేస్తుందటే. వీటి నుంచి జాగ్రత్త పడితే మనం గుండెపోటు బారి నుండి తప్పించుకోవచ్చు. మరి ఆ లక్షణాలు ఏంటో తెలుసుకోండి.



# ఈ లక్షణాలని నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు వచ్చి ప్రాణాలు పోతాయి.. జాగ్రత్త



### ఛాతీలో నొప్పి..



గుండెనొప్పి వచ్చే కొన్ని రోజుల ముందు నుంచే ఛాతీలో నొప్పి ఉంటుంది. ఈ నొప్పి గ్యాస్, అసిడిటీ వచ్చినప్పటి నొప్పి కంటే ఎక్కువగా ఉంటుంది. నొప్పిగా ఉన్నప్పుడు, పట్టేసినట్టు ఉండడం, ఒత్తిడిగా అనిపిస్తుంది. కొన్నిసార్లు ఎక్కువసేపు ఉంటుంది. కొన్ని సార్లు వచ్చి వెళ్తుంది. ఎడమవైపు మరీ పెయిన్గా ఉంటుంది.

### ఇతర భాగాల్లో నొప్పి..




కేవలం ఛాతీలో నొప్పి మాత్రమే కాదు.. చేతులు, దవడ, మెడ, వీప, పొట్ట వరకూ నొప్పి ఉంటుంది. ఉన్నట్లుండి నొప్పి పెరుగుతుంది. ఏ పని చేయలేరు. ఈ టైమ్లో వెంటనే డాక్టర్ని కలవడం మంచిది.

### శ్వాస సమస్యలు..




గుండెపోటు వచ్చే ముందు శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా అనిపిస్తుంది. శ్వాస సరిగా అందదు. సడెన్గా ఒత్తిడి పెరుగుతుంది. గుండెలో మంట, జీర్ణ సమస్యలా ఉండి శ్వాస అందదు.

### చెమటలు పట్టడం..



ఎలాంటి పని చేయకున్నా ఒక్కసారిగా చెమట పడుతుంటే ఆలోచించొద్దు. ఇది కూడా గుండెనొప్పికి ముందు కనిపించే లక్షణమే. దీంతో పాటు వెన్నునొప్పి, దవడ నొప్పి తీవ్రంగా ఉంటుంది. అలసటగా కూడా ఉంటుంది. ఏ పనిచేయలేరు, నీరసంగా ఉంటారు.

### కళ్ళు తిరగడం..



ఈ సమస్య కూడా ఉంటుంది. అయితే, కొన్నిసార్లు నీరసంగా ఉన్నప్పుడు కూడా కళ్ళు తిరుగుతాయి. అయితే, సరిగ్గా ఫుడ్ తిన్నప్పటికీ, తల తిరగడం, కళ్ళు తిరిగినట్లు అనిపిస్తే మాత్రం దీనిని నిర్లక్ష్యం చేయొద్దు..

### ఒత్తిడి..

గుండె నొప్పి ముందు ఒత్తిడిగా అనిపిస్తుంది. భయం వేస్తుంటుంది. ఆందోళనగా ఉంటుంది. దేనిపై కూడా కాన్సంట్రేట్ చేయలేరు.ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలన్నీ కూడా మనకి కొన్ని రోజుల ముందునుంచే కనిపిస్తాయి. ఇవి కనిపించినప్పుడే ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్ని కలవాలి. ఏ మాత్రం ఆలసించినా ప్రాణాలు పోతాయి. జాగ్రత్త.

గమనిక : ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు